www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 19 ఫిబ్రవరి 2025

5

చిత్తూరు



జడ్పీ సీఈవో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: చిత్తూరు జిల్లా పరిషత్ సీఈఓ రవికుమార్ నాయుడు మంగళవారం సదుం ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఇన్చార్జి ఎంపీడీవో డిఎస్.హరిబాబుతో ఉపాధి హామీ పథకం జరుగుతున్న తీరును ఆయన అడిగి తెలుసుకున్నారు. మండల పరిధిలో ఉపాధి హామీ పథకం నిర్వహిస్తున్న కార్యక్రమాలపై గ్రామాలలో ఉపాధి కూలీలకు సక్రమమైన పద్ధతిలో అవకాశాలు కల్పించలేదని పలువురు సీఈఓ దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే ఉపాధి హామీ పథకం పై ఆరా తీశారు. అనంతరం అర్హులైన రైతులకు, ఎస్సీ ఎస్టీ భూములలో అభివృద్ధి పనులకు ఉపాధి హామీ పథకం అనుసంధానం చేసి సక్రమమైన పద్ధతిలో నిర్వహించాలని ఎంపీడీవోకు సూచించారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నీడనిచ్చే మొక్కలు నాటాలన్నారు. ఏపీవో శ్రీనివాసులు, ఎంపీడీవో పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక బడ్జెట్‌పై ప్రజలు స్పందించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులు ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రజావ్యతిరేక ప్రతిపాదనలను ప్రజలు తిరస్కరించాలని దేశవ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో విస్తృత ప్రచారంలో భాగంగా మంగళవారం సిపిఎం కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ముఖ్య అతిధిగా హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు దేశవ్యాప్తంగా ప్రజలకు వివరిస్తూ చేసే కార్యక్రమంలో భాగంగా జిల్లాలో కూడా విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో కొనుగోలుశక్తి కుచించుకుపోయినందున ఆర్థిక వ్యవస్థలో తగిన డిమాండ్ సమస్యను పరిష్కరించడానికి బదులు అందుకు విరుద్ధంగా మోడీ ప్రభుత్వం సంపన్నులకు రాయితీ ఇవ్వడం, ఖర్చుల్లో కోత పెట్టడం దారుణమన్నారు. నిరుద్యోగ సమస్యను ఈ బడ్జెట్ పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ఆహార సబ్సిడీలు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, గ్రామాణాభివృద్ధి, సామాజిక సంక్షేమపై పెట్టిన ఖర్చు గత ఏదాడి కంటే బాగా తగ్గిపోయిందన్నారు. ఉపాధి హామీ చట్టానికి నిధులు అదనంగా కేటాయించలేదని, ధరల పెరుగుదల జిఎస్టీ పెంపుదలతో అనేక ఇబ్బందులుపడుతున్న కార్మికవర్గాన్ని ఈ బడ్జెట్ విస్మరించిందని అన్నారు. ఈ ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ఈకింది ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వామపక్ష పార్టీలు నిర్ణయించాయని తెలిపారు. సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు మాట్లాడుతూ ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు, వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ కల్పించాలన్నారు. అలాగే వ్యవసాయ మార్కెటింగ్‌పై జాతీయ విధాన ముసాయిదాను ఉపసంహరించాలని, ప్రభుత్వ రంగ ఆస్తులను ప్రైవేట్ రంగానికి బదలాయించడాన్ని ఆపాలన్నారు. బీమా రంగంలో వంద శాతం ఎఫ్‌డిఐలను ఉపసంహరించాలని, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయింపులను 50 శాతం పెంచాలని, పట్టణ ఉపాధి హామీ చట్టాన్ని కూడా ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. వృద్ధాప్యపు పెన్షన్లు, ఇతర సామాజిక భద్రతా ప్రయోజనాల కోసం కేంద్ర కేటాయింపులు పెంచాలన్నారు. ఎస్సీ, ఎస్టీ రంగాలకు, మహిళా, శిశు సంక్షేమానికి కేటాయింపులను గణనీయంగా పెంచాలని వీటిల్లో ఐసిడిఎస్‌కు కూడా కేటాయింపులు పెరగాలన్నారు. అలాగే స్కీమ్ వర్కర్లకు ఇచ్చే గౌరవ వేతనాల్లో కేంద్రం వాటాను పెంచాలని, రాష్ట్రాలకు నిధుల బదిలీని పెంచాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా నాయకులు కె.సురేంద్రన్, ఓబుల్ రాజు, మురళి, బాలసుబ్రమణ్యం, సిపిఐ నాయకులు గోపీనాథ్, దాసరి చంద్ర, రమాదేవి, విజయ గౌరీ, తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

- రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు నీరు
- ఎక్కడికక్కడే చెత్తాచెదారం
- ముస్లింనగర్ వైపు కన్నెత్తి చూడని అధికారులు
- పంచాయతీ నిధులు ఏమయ్యాయంటున్న ప్రజలు

పల్లెల్లో పారిశుధ్యం లోపించి అస్తవ్యస్తంగా మారాయి. డ్రైనేజీ వ్యవస్థ ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతున్నది. ఈగలు, దోమల బెడద పెరిగి వ్యాధులు విజృంభిస్తున్నాయి. గ్రామాల్లో పారిశుధ్యం నెలల తరబడి అధ్వాన్నంగా తయారవ్వడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.



కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలు

ప్రజాశక్తి- విజయపురం (నగరి): నగిరి మండలంలో వికెఆర్ పురం పంచాయతీ మీరాసాహిబ్ పాళ్యం (ముస్లిం నగర్) చుట్టు పక్కల మురుగునీరు నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని, దోమలు, ఈగల బెడద తప్పడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీటి కాలువల్లో చెత్తాచెదారం, ప్లాస్టిక్ కాగితాలు ఎక్కడిక్కడ పేరుకుపోవడంతో మురుగు సాఫీగా పోవడానికి దారిలేక రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో చుట్టుపక్కల నివాసముంటున్న వారు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురిఅవుతున్నారు. గ్రామాల్లోని పారిశుధ్య సమస్యను పలుమార్లు పంచాయతీ కార్యదర్శి దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కనీసం కన్నెత్తి చూసిన పాపానపోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు..

పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. ఎక్కడపడితే అక్కడ మురుగునీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. మురుగునీటి కాలువలు పూడిపోవడంతో ఇళ్ల వద్ద, వీధుల్లో రోడ్లపై మురుగు నిలిచిపోయి నీటిగుంతలను తలపిస్తున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పల్లెలవైపు కన్నెత్తి చూడడం లేదు. అసలే సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా వంటివి ఎక్కువగా ఉన్నాయని పారిశుధ్య లోపం కారణంగా దోమల విపరీతంగా పెరిగిపోయి నానా ఇబ్బందులు పాడుతున్నామని దోమల నివారణకు సైతం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు చెబుతున్నారు.

పంచాయతీకి వచ్చిన నిధులు ఎక్కడ..?

గ్రామాభివృద్ధికి వచ్చిన నిధులు ఎక్కడున్నాయి.. ఏమయ్యాయని గ్రామస్తులు నిలదీస్తున్నారు. గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి గ్రామస్తులు రోగాలబారిన పడుతున్నా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నిత్యం మురుగునీరు ఇళ్ల మధ్య చేరి దుర్వాసన వెదజల్లుతోందని, దోమలు విపరీతంగా పెరిగి ఇబ్బందులు పడుతున్నామని అయినప్పటికీ అధికారులు మాత్రం మా గ్రామం వైపు కన్నెత్తి చూసిన రోజే లేదని చెబుతున్నారు. పలుమార్లు సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటికీ సమస్యను పరిష్కరించలేదన్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి తమ గ్రామం వైపు కన్నెత్తి చూడాలని పారిశుధ్యం, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఎక్కడిక్కడ నిలిచిపోయిన మురుగునీరు

'అపోలో'లో

జాతీయ విజ్ఞాన దినోత్సవ వేడుకలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అపోలో విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 28న జరగనున్న జాతీయ విజ్ఞాన దినోత్సవ వేడుకల పోస్టర్‌ను చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో జరిగే కార్యక్రమంలో స్థానిక పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను వారి విజ్ఞాన ప్రాజెక్టులను ప్రదర్శించేందుకు ఆహ్వానిస్తున్నారని, వివిధ విజ్ఞాన రంగాలలో మొత్తం 27 బహుమతులు (9 ప్రథమ బహుమతులు, 9 ద్వితీయ బహుమతులు మరియు 9 తృతీయ బహుమతులు) అందజేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ ప్రాజెక్టు ఆలోచనలను ప్రదర్శనల రూపంలో సమర్పించవచ్చు అని, ఈ కార్యక్రమం ద్వారా యువ శాస్త్రవేత్తలను ప్రోత్సహించడం, వారిలో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించడం ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు. అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్, హెచ్.వినోద్ భట్ మాట్లాడుతూ సైన్స్, టెక్నాలజీ రంగంలో విద్యార్థులకు ప్రాథమికంగా పరిశోధన మేలుపరచే అవకాశాన్ని అందించేందుకు ఇలాంటి వేడుకలు ఉపయోగపడతాయని అన్నారు.

వదంతులు ప్రచారం చేస్తే చర్యలు తప్పవు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 16వ తేదీ కుప్పం మండలంలో చోటు చేసుకున్న పెయింటర్ మృతి కేసులో యూట్యూబ్ ఛానల్ సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేసిందని ఇలాంటివి మానుకోవాలని సూచించారు. అసత్యాలను ప్రచారం చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేసేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బుధవారం స్థానిక పోలీస్ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ కుప్పం మండలం, చందం గ్రామానికి చెందిన 24 సంవత్సరాల మురుగేష్ తన జీవనోపాధి కోసం పైంటింగ్ పనులు చేసుకుంటూ జీవించేవాడని ఈ క్రమంలో కుప్పం పట్టణంలో నివసిస్తున్న గౌరీ శేఖర్ ఇంటికి మురుగేష్, బాలాజీ కలిసి పెయింటింగ్ పనులు చేస్తుండేవారని తెలిపారు. ఫిబ్రవరి 16 తేదీన సాయంత్రం, బాలాజీ ఒకటవ అంతస్తుకు పెయింటింగ్ చేస్తున్న సమయంలో అతను పట్టుకున్న తాడు ప్రమాదవశాత్తు తెగిపోవడంతో కిందపడిపోయాడని అదే తాడును పట్టుకున్న మురుగేష్ సైతం పై అంతస్తు నుండి కిందపడిపోయాడని చుట్టుపక్కల ఉన్న వారు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారని గాయపడిన వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని తెలిపారు. ఆసుపత్రిలో వైద్యులు మురుగేష్‌ను పరిశీలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారని, తీవ్ర గాయాలపాలైన బాలాజీకీ తగిన వైద్యం అందించారని తెలిపారు. ఈ ఘటనపై మురుగేష్ తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుప్పం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారని పై ఘటనకు సంబంధించిన వార్తపై కొంతమంది సామాజిక మాధ్యమాల్లో అంబులెన్స్ ఆలస్యంగా చేరుకోవడం వల్ల మురుగేష్ మృతి చెందాడని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. అయితే వాస్తవంలో అంబులెన్స్ కేవలం 8 నిమిషాల్లోనే సంఘటన స్థలానికి చేరుకుని వెంటనే ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు. మురుగేష్ పై అంతస్తు నుండి పడిపోవడంతో తలకు తీవ్రమైన గాయమై అక్కడికక్కడే మరణించినట్టు వైద్యులు నిర్ధారించారని తెలిపారు. అంబులెన్స్ ఆలస్యమైందని వస్తున్న వదంతుల్లో నిజం లేదని స్పష్టంగా చేశారు. సామాజిక మాధ్యమాల్లో సమాచారం ప్రచురించే ముందు నిజాలను పరిశీలించాలని అసత్య ప్రచారాలకు దూరంగా ఉండాలని కోరారు. నిజానిజాలు తెలీకుండా తప్పుడు సమాచారం వ్యాప్తి చేయడం బాధ్యతారాహిత్యమైన చర్య అన్నారు. సామాజిక మాధ్యమాలలో ఎవరైనా అసత్య ప్రచారాలు చేస్తే, వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎన్‌టిఆర్ వైద్యసేవ ద్వారా సేవలందించడంలో

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు: కలెక్టర్



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఎన్‌టిఆర్ వైద్యసేవ ద్వారా సేవలందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో ఎన్‌టిఆర్ వైద్యసేవ ట్రస్ట్ ద్వారా సేవలందించే ఆరోగ్య మిత్రలతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఏరియా ఆసుపత్రులు, సిహెచ్‌సిలు, నెట్వర్క్ ఆసుపత్రులలో ఎన్‌టిఆర్ వైద్యసేవ ట్రస్ట్ ద్వారా రోగులకు వైద్యసేవలు పొందడంలో ఆరోగ్యమిత్రలు పూర్తి సహాయ సహకారాలు అందించి వారి తోడ్పాటును అందించాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం తగదని తెలిపారు. నెట్వర్క్ ఆసుపత్రులలలో ఎన్‌టిఆర్ వైద్యసేవ ద్వారా వైద్యసేవలు పొందేందుకు వచ్చే రోగుల నుంచి సంబంధిత యాజమాన్యాలు నగదు రహిత వైద్యం అందించేలా ఆరోగ్యమిత్రలు చర్యలు చేపట్టాలన్నారు. నగదు రహిత వైద్యం పొంది డిశ్చార్జ్ అయిన రోగుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకునేందుకు సంబందిత ఏఎన్ఎంలకు సమాచారం అందించి వారికి సంబంధించిన సమాచారాన్ని యాప్‌లో అప్‌లోడ్ చేసేలా ఆరోగ్యమిత్రలు సమన్వయం చేసుకోవాలన్నారు. ఈ విషయంలో మెడికల్ ఆఫీసర్ల సహకారంతో ముందుకు వెళ్లాలని ఎన్‌టిఆర్ వైద్యసేవ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్‌ను ఆదేశించారు. ఆరోగ్యమిత్రలు సమయపాలన పాటించాలని, విధులను భాద్యతతో సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు.

పరిశ్రమల యాంత్రీకరణపై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న గోవర్ధన్ బాబి

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: జిల్లాలో ఎక్కువమంది రైతులు ప్రధాన పంటగా మామిడిని పండిస్తున్నందున, ఎక్కువ మ్యాంగో పల్ప్ ఫ్యాక్టరీలు చిత్తూరులోనే ఉన్నాయని, ఈ ఫ్యాక్టరీలలో ఎప్పటికప్పుడు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ద్వారా ఖర్చులు తగ్గించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని దక్షిణ భారత ఆహార శుద్ధి పరిశ్రమలదారుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ బాబి అన్నారు. మంగళవారం కట్టమంచి బాలకృష్ణారెడ్డి మ్యాంగో భవన్లో పరిశ్రమల ప్రతినిధులు, ఆల్ఫా లావల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, పూనే, స్వీడన్ దేశ ప్రతినిధులతో యాంత్రీకరణ పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ బాబి మాట్లాడుతూ జిల్లాలో 1978 సంవత్సరంలో మామిడి పల్ప్ పరిశ్రమలను ప్రారంభించడం జరిగిందన్నారు. తరువాత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వైపు 2008 సంవత్సరం నుంచి ఎక్కువగా ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రస్తుతం చాలా పరిశ్రమలు ఆధునిక సాంకేతికతను ఉపయోగించి అసెప్టిక్ ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని పరిశ్రమలు సుమారు 8 లక్షల టన్నుల మామిడి పండ్లను పల్ప్ చేయడం జరుగుతోందనీ, జిల్లాలో ఉన్నన్ని మామిడి పండ్ల పరిశ్రమలు ఎక్కడ లేవని, ఈ పరిశ్రమంలో ఉత్పత్తిదారులు కూడా ఎప్పటికప్పుడు టెక్నాలజీని పెంచుకుంటూ ఖర్చు తగ్గించే ప్రయత్నం చేయాలని సూచించారు. ఇందులో భాగంగానే ఆల్ఫా లావల్ ఇండియ, స్వీడన్ దేశ ప్రతినిధులు రావడం జరిగిందన్నారు. ఆల్ఫా లావల్ స్వీడన్ దేశ ప్రతినిధి పీటర్ నెల్సన్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా జిల్లాలోని మామిడి పరిశ్రమలకు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు పలు యంత్రాలను సరఫరా చేయడం జరిగిందని, ఈ ఏడాది మ్యాంగో సీజన్ ప్రారంభానికి ముందే పరిశ్రమలలో ఏవైనా సమస్యలు తమతో సంప్రదించి తమ సేవలను ఉపయోగించుకోవాలని కోరడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా తమ కంపెనీ నాణ్యమైన ఉత్పత్తులతో పాటు మన్నికైన సర్వీస్‌ను అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా పండ్ల పరిశ్రమల సమాఖ్య అధ్యక్షుడు శివకుమార్ ఆధ్వర్యంలో ఆల్ఫా లవర్ కంపెనీ స్వీడన్ దేశ ప్రతినిధులు అయిన పీటర్ నెల్సన్, మార్కస్ హాఫ్మాన్‌తో పాటు భారతదేశ ప్రతినిధులు శుభాశీస్సు దాస్, ధర్మేశ్, హితేందర్ కుమార్, అతుల్ జోషి, భాస్కర్ ఆనంద్ తదితరులను పండ్ల పరిశ్రమల సమాఖ్య సభ్యులు సత్కరించారు. చిత్తూరు జిల్లా పండ్ల పరిశ్రమలకు సంబంధించిన 60మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో గుడిపాల మండలం

పలు ప్రారంభోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేస్తున్న ఎమ్మెల్యే గురజాల

ప్రజాశక్తి- గుడిపాల

గ్రామీణ ప్రజలు ఐదేళ్ల తర్వాత అభివృద్ధి పనులు చూస్తున్నారని.. గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల సందర్భంగా ప్రజల్లో ప్రభుత్వం పట్ల సంతృప్తికర భావన సంతోషాన్నిస్తుందని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం గుడిపాల మండలంలో వరుసగా రెండవ రోజు మంగళవారం రూ.2.26 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రారంభోత్సవాలు చేశారు. ఈసందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి ఫలితంగా రాష్ట్రంలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో గ్రామాల్లో ఒక్క అభివృద్ధి పని జరగలేదని, కూటమి ప్రభుత్వంలో 8 నెలలకే కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. గ్రామాల్లో సమస్యల పరిష్కరించడమే తన లక్ష్యమని చెప్పారు. గ్రామాల ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అందిస్తే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను స్థానిక నాయకుల చేత రిబ్బన్ కట్ చేయించే ఎమ్మెల్యే తన ఉదారతను చాటుకున్నారు. సి.బండపల్లి వద్ద ఆలయం నిర్మించాలని మహిళల కొరగా రూ.50వేలు సొంత నిధులను విరాళంగా అందించారు. వసంతాపురంలో జరిగిన కార్యక్రమంలో రాయితీపై మంజూరు చేసిన 9 గ్రాస్ కట్టర్ యంత్రాలను రైతులకు పంపిణీ చేశారు. కిల్లారిపల్లి, గుడిపాల లేఅవుట్, గుడిపాల, అడవిచేను, పాప సముద్రం, వెప్పలమానుచేను, సి.బండపల్లి, చిత్తపార గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, గుడిపాలలో రైతు భరోసా కేంద్ర భవనం, చిత్తపారలో సచివాలయ భవనం, పిల్లారికుప్పంలో నీటిశుద్ధి ప్లాంటును ప్రారంభించారు. కార్యక్రమంలో చిత్తూరు మేయర్ ఎస్.అముద, ఎంపీడీవో శివరాజ్, తహశీల్దార్ జయంతి, మాజీ జెడ్పిటిసి సుమతి, ఎంపీటీసీ హరిప్రసాద్, సాంబశివ నాయుడు, సుబ్రహ్మణ్య నాయుడు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు జ్ఞానజ్యోతి శిక్షణ



బైరెడ్డిపల్లిలో..

ప్రజాశక్తి- పుంగనూరు: రాష్ట్రంలో పాఠశాల విద్యను బలోపేతం చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలకు 120 రోజుల కోర్సును ఆరు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మండల విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. స్థానిక బసవరాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. మండల విద్యాశాఖ అధికారి రెడ్డన్న చెట్టి, ఐసిడిఎస్ ఆఫీసర్ రాజేశ్వరి, కోర్సు డైరెక్టర్స్‌గా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసుంధర, సుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు. రిసార్ట్స్ పర్సన్స్‌గా వెంకటరమణారెడ్డి ప్రసాద్, సర్వేశ్, సుగుణ, కల్పన హాజరై శిక్షణ ఇవ్వడం జరిగింది. జిల్లా సర్వ శిక్ష అభియాన్ గర్ల్ చైల్డ్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఇంద్రాణి, ఏఎస్ఓ నాగేశ్వరరావు, అంగన్వాడీలు సీఆర్పీలు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత బాలురు, బాలికలు పాఠశాలలో మండలంలోని అంగన్వాడీ సిబ్బందికి జ్ఞానజ్యోతి ఆరు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించడం జరిగింది. కోర్స్ డైరెక్టర్ ఎంఈఓ బండిసుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు గౌహర్ సుల్తానా, ఎస్ నసీబ్ జాన్, సిడిపిఓ అరుణశ్రీ, కోర్స్ కోఆర్డినేటర్స్, రిసోర్స్ పర్సన్స్ శశి కుమార్, మోహన్, రాజశేఖర్, రాజేష్, సుజాత, రమాదేవి, అంగన్వాడీ, సీఆర్పీలు పాల్గొన్నారు.


పలమనేరు: మండలంలో అంగన్వాడీ కార్యకర్తలకు ఆరు రోజుల శిక్షణా కార్యక్రమం మంగళవారం పట్టణంలో స్థానిక గవర్నమెంట్ ఉన్నత పాఠశాలలో ప్రారంభమైంది. ఎంఈవోలు పి.లీలరాణి, బాలసుందర మాట్లాడుతూ పిల్లల భాషాభివృద్ధి, సంఖ్యా వృద్ధి సాధించడానికి అంగన్వాడీలు కృషి చేయాలని అందుకు ఈ శిక్షణా కార్యక్రమంలో ఉపయోగపడుతుందని తెలిపారు. రిసోర్స్ పర్సన్స్ నగరాజ, చందు, సిడిపిఓ ప్రియదర్శని, సూపర్వైజర్స్ ద్రాక్షాయని, మాధవీలత, నజ్మా, సిఆర్ఎంటిలు హరిబాబు, రంజిత్ కుమార్, అనిల్ కుమార్, రెడ్డెమ్మ, గీత పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: మండలంలో ఆరు రోజుల శిక్షణా కార్యక్రమం మంగళవారం గంగాధర నెల్లూరు తూగుండ్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారులు ఆంజనేయులు శెట్టి, గుణశేఖర్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సిడిపిఓ వినీత శ్రీ, బిందు మాధవి, విజయ్ కుమార్, వరదయ్య, దేవేంద్ర రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించనున్నారని తెలిపారు.



పలమనేరులో..

రొంపిచర్ల: మండలంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈశిక్షణా తరగతులు ఆరు రోజులపాటు జరుగుతాయని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి తెలియజేశారు. గ్రామ సర్పంచ్ ఇబ్రహీం ఖాన్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఎంఈఓలు ఎన్.ఇందిర, డి.శ్రీనివాసులు, ఐసిడిఎస్ సూపర్వైజర్ శిరీష, అంగన్వాడీలు పాల్గొన్నారు.



విజయపురంలో..

విజయపురం (నగరి): అంగన్వాడీ కార్యకర్తలకు సపోర్టింగ్ ఆంధ్రా లర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) కార్యక్రమంలో భాగంగా శిక్షణ అందించారు. మంగళవారం స్థానిక పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ శిక్షణా కార్యక్రమం జరిగింది. రెండు విడతలుగా నిర్వహించనున్న ఈ శిక్షణలో తొలిరోజు ప్రాజెక్టు డైరెక్టర్ డి.వెంకటేశ్వరి పాల్గొన్నారు. మండల విద్యాశాఖాధికారులు శ్రీదేవి, నమశ్శివాయంలు మాట్లాడుతూ మొదటి విడతగా మంగళవారం ప్రారంభమైన శిక్షణ 20వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు రెండవ విడత శిక్షణ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతుందన్నారు. సీడీపీవో కృష్ణవేణి, సూపర్వైజర్లు, అంగన్వాడీ పాల్గొన్నారు.

సోమల: మండల కేంద్రమైన సోమలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరు రోజులపాటు నిర్వహించనున్న జ్ఞానజ్యోతి అంగన్వాడి కార్యకర్తలకు శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం సిడిపిఓ రాజేశ్వరమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల మనోవికాసాన్ని అభివృద్ధి పరిచేందుకు ఆరు రోజులపాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని ఈ ఆరు రోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు మినీ అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొని రిసోర్స్ పర్సన్లు తెలిపే పలు అంశాలను అవగాహన చేసుకుని అంగన్వాడీ కేంద్రాలలో అమలు పరచాలని కోరారు. ఎంఈఓ శివరత్నమ్మ, సూపర్వైజర్ హరిత, రిసోర్స్ పర్సన్ లు పాల్గొన్నారు.

23న ఎగువ కన్నికాపురంలో జల్లికట్టు నిబంధనలు అమలయ్యేనా?


ప్రచారం సాగిస్తున్న బ్యానర్

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలంలోని ఎగువ కన్నికాపురంలో ఈ నెల 23వ తేదీ ఆదివారం జల్లికట్టు నిర్వహిస్తామని ఆ గ్రామ యువకులు జోరుగా ప్రచారం చేస్తు న్నారు. ప్రచార బ్యానర్లు అక్కడక్కడా ఏర్పాటు చేశారు. న్యాయ స్థానాలు జల్లికట్టు నిర్వహించ కూడదని ఆదేశం చించాయి. అయినా మండలంలో ఎలాంటి నిబంధనలు అమలు కావడం లేదు. పోలీసులు ప్రేక్షక పాత్ర పోషి స్తున్నారనే విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. జల్లికట్టు ఆ గ్రామస్తులు నిర్వహి స్తారా? లేక నిబంధనలు వర్తింప జేసి అడ్డుకుంటారా?' అని మండల వాసు ఎదురు చూస్తున్నారు.

అడవులను రక్షించుకుందాం

ప్రజాశక్తి -రొంపి చెర్ల : పులిచెర్ల మండలం కావేటి గారి పల్లి లో మంగళవారం "అడవికి నిప్పు మానవాళికి ముప్పు " అనే కార్యక్రమం పై ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మహమ్మద్ షఫీ అవగాహన సదస్సు నిర్వహించారు. అడవులకు నిప్పు పెట్టకుండా రక్షించుకుందామని, అడవులకు నిప్పు పెట్టితే మానవాళికి ముప్పు వాటిల్లుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ బీట్ ఆఫీసర్ హరిప్రియ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బాలిక మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి

మహిళా సంఘం నాయకురాలు జయంతి డిమాండు

ప్రజాశక్తి - పలమనేరు: పలమనేరు మండలం టీ వడ్డూరులో బాలికపై పలుమార్లు అత్యాచారం చేసి గర్భవతిని చేసి మృతికి కారణమైన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి జైలుకు పంపించాలని మహిళా సంఘం నాయకురాలు (సిపిఎం) జయంతి డిమాండు చేశారు. పదవ తరగతి విద్యార్థినిపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడి గర్భిణిని చేసి రక్త హీనతతో ప్రసవం కష్టమై బాలిక చనిపోవడం సభ్య సమాజం సిగ్గుపడేలా వుందన్నారు. సిపిఎం మహిళా సంఘం నాయకురాళ్లు మంగళవారం బాలిక మృతదేహాన్ని సందర్శించారు. ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా జయంతి మాట్లాడుతూ దీనికి కారకులైన మంజు, నవీన్, హరిత, రోజాలను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ గ్రామంలో ఇది కొత్త కాదని ఈ గ్రామంలో ప్రజలు వాపోతున్నారని రెండుసార్లు గతంలో కూడా ఇలాంటివి గతంలోనూ చోటుచేసుకున్నాయన్నారు. ఎవరికి చెప్పుకున్నా న్యాయం జరగలేదని ప్రజలు వాపోతున్నారని పేర్కొన్నారు. ఇది మూడోసారి ఘటన చోటుచేసుకుందని ఇకనైనా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కు మని బతుకుతున్న మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు. ఆడ పిల్లల తల్లిదండ్రులు కన్నీరుమున్నీ రవుతున్నారని, ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి సునీత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. బాలిక కుటుంబానికి న్యాయం జరగకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. వెంటనే స్పందించి నిందితులను అరెస్ట్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో ఇలా కొనసాగంపై విచారణ జరిపి వాటి, సునీత కుటుంబాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం తక్షణమే అన్ని చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గిరిధర్ గుప్తా, రాజా, సుధాకర్ మహిళా సంఘం ధనమ్మ, అమరమ్మ పాల్గొన్నారు.

పలమనేరు: పలమనేరు రూరల్ మండలం టీ వడ్డూరులో బాలిక సునీత మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల అనుబంధ మహిళా సంఘం అధ్యక్షురాలు సరస్వతి డిమాండ్ చేశారు. అందులో భాగంగా పలమనేరు పట్టణ పరిధిలోని మానవ హక్కుల కార్యాలయంలో రుక్మిణి అధ్యక్షతన ఈ సంఘటనపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మానవ హక్కుల జిల్లా నాయకులు డివి మునిరత్నం మాట్లాడుతూ బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. వ్యక్తం చేశారు. గ్రామాల్లో కొంతమంది మధ్యవర్తులు వల్ల అనేకమంది చిన్నారులు బలైపోతున్నారని తెలిపారు.


బాలిక కుటుంబాన్ని పరామర్శిస్తున్న మహిళా సంఘం నాయకురాలు జయంతి

సునీత విషయంలో కూడా అదే గ్రామానికి చెందిన ఓ మధ్యవర్తి ముఖ్య పాత్ర వహించినట్లు గ్రామస్తులు ద్వారా సమాచారం తెలిసిందన్నారు. శ్రీదేవి మాట్లాడుతూ నిత్యం రెక్కల కష్టంతో బతికే పిల్లల తల్లిదండ్రులు ఆడపిల్లల విషయంలో నిర్లక్ష్యం వహించ కుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణలో ఉండాల్సింది ఎంతైనా ఉందన్నారు. ఆడపిల్లల తల్లిదండ్రులకు రోణ కల్పించాలని కోరారు. ఎన్ని చట్టాలు వున్నా ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటూనే వున్నాయన్నాయన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, మురళి, వెంకటేష్, గంగిరెడ్డి, అరుణ్ పాల్గొన్నారు.


కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆర్‌కె రోజా

కార్యకర్తలకు అండ: మాజీ మంత్రి

ప్రజాశక్తి -విజయపురం: 'కార్యకర్తలు అధైర్యపడకండీ..మీకు నేను అండగా ఉంటా..' అని మాజీ మంత్రి ఆర్కే రోజా పేర్కొన్నారు. మండలంలోని పన్నూరు దళితవాడలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి మంగళవారం పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ శ్రేణులు సమిష్టిగా, ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం కుట్టెమ్మ కుటుంబాన్ని, నూతనంగా వివాహమైన వార్డు సభ్యులు దేవీ ఆనందరాజ్ కుటుంబంలో వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాలాజీ, నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కుమార్, మండల వైసీపీ అధ్యక్షుడు శివరాజు, నాయకులు గుణ శేఖర్‌రెడ్డి, ఈజీ బాబు, వెంకటేశు, శేఖ‌రాజు, పాండ్యన్, చెంగల్రాయలు పాల్గొన్నారు.

పిహెచ్‌సి ఆకస్మిక తనిఖీ


ఆస్పత్రి రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్

ప్రజాశక్తి-ఐరాల: జిల్లా మలేరియా అధికారి వేణు గోపాల్ కాణిపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళ వారం సందర్శించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి ల్యాబ్, రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మలేరియా అధికారి మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా, ఫైలేరియా వ్యాధులు రాకుండా ప్రజలందరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు డాక్టర్ ఏ స్వాతి సింధూర, డాక్టర్ టి రాజేశ్వరి, మలేరియా సబ్ యూనిట్ అధికారి శివ సుబ్రహ్మణ్యం, ఆరోగ్య విస్తరణ అధికారి వి శివయ్య, పబ్లిక్ హెల్త్ నర్స్ ఎల్ వేదవతి, హెల్త్ సూపరువైజర్స్ నారాయణ, మనోహర్, నాగరత్నమ్మ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి అండ : పి ఎస్ మునిరత్నం

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : కుప్పం మండలం చందం గ్రామ వాసి, టిడిపి వీరాభిమాని మురుగేష్ కుటుంబానికి టిడిపి అండగా ఉంటుందని ఏపీఎస్‌ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం తెలిపారు.


పరామర్శిస్తున్న పిఎస్ మునిరత్నం


చందం గ్రామానికి చెందిన మురుగేష్ కుప్పం పట్టణంలో ఒక భవనానికి రంగులు వేస్తున్న సమయంలో చోటు చేసుకున్న ప్రమాదంలో మృతి చెందినట్లు వారు తెలిపారు. ఆయన అంత్యక్రియలు మంగళవారం స్వగ్రామంలో జరగడంతో వారి ఇంటి వద్దకు చేరుకుని, మృతదేహానికి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని కల్పిస్తూ టిడిపి బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి,-కుప్పం రూరల్ : కుప్పం మండలం చందం గ్రామ పంచాయతీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వి మార్కొండ నాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు లోకనాథం మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం పోటీలలో గెలుపొందిన వారికి క్రీడా దినోత్సవం రోజున బహుమతులు అందించనున్నట్లు తెలిపారు.

పోలీస్ స్టేషన్‌కు బారికేడ్లు వితరణ

ప్రజాశక్తి -విజయపురం (నగరి): స్థానిక పోలీస్ స్టేషన్‌కు ట్రాఫిక్ నియంత్రణకు క్రెడిట్ యాక్సెస్ ఇండియా ఫౌండేషన్, క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్ కంపెనీ వారు 15 బారికేడ్లను అందించారు.


పోలీసులకు బారికేడ్లు అందిస్తున్న దాతలు

మంగళవారం స్టేషన్‌కు విచ్చేసిన వారు బారికేడ్లను సీఐ మహేశ్వర్‌కు అందించారు. ఈ సందర్భంగా సీఐ దాతలను అభినందించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల రక్షణ వంటి అంశాల్లో బారికేడ్లు ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు తిరుపతి డిఎం జగదీష్, ఏరియా మేనేజర్ సిద్ధారెడ్డి, బ్రాంచ్ మేనేజర్ వెంకటా చలపతి, పోలీసులు పాల్గొన్నారు.

అరాచక వాదులంటే జగన్‌కు ప్రేమ: మాజీ ఎమ్మెల్సీ

ప్రజాశక్తి -శాంతిపురం : దేశం కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజా ఉద్యమాలు, పోరాటాలు చేసే వాళ్లకంటే, గుండాగిరి, దాదాగిరి చేసే వాళ్లు, రాజకీయ నేరస్థులంటేనే జగన్ రెడ్డికి ఎంతో ప్రేమ అని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక జైలు పక్షిగా ఇంకో జైలు పక్షి మీద సానుభూతి చూపించడానికి జగన్ రెడ్డి వెళ్లాడని తన క్రిమినల్ బ్యాచ్ కోసం సిగ్గులేని ఓదార్పు యాత్రలు చేయడంలో ఈయనకు ఈయనే సాటి అని విమర్శించారు. వంశీ టీడీపీ కార్యాలయంపై వంశీ తన అనుచరులు చేసిన వీరంగం సంగతి ఏమిటి అని ప్రశ్నించారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు.


పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

పంటల సాగుపై అవగాహన

ప్రజాశక్తి- తవణంపల్లి: మారేడు పల్లి, ఉత్తర బ్రాహ్మణ పల్లె (వడ్డే పల్లి) గ్రామాలలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది'ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంటల సాగుపై అవగాహన కల్పించారు. చిత్తూరు సహాయ వ్యవసాయ సంచాలకులు డి ఉమా మాట్లాడుతూ ప్రతి రైతు విధిగా రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి విశిష్ట సంఖ్యను పొందాలని సూచించారు. ఈ సంఖ్యను పొందడం వల్ల రైతులు ప్రభుత్వ పథకాల వల్ల వచ్చే ప్రతి సదుపాయాలు పొంద వచ్చునని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేస్తున్న ఈ కార్యక్రమానికి రైతులు సహకరించాలని కోరారు. మండల వ్యవసాయ అధికారి జి ప్రవీణ్ మాట్లాడుతూ పంట నమోదు , వివిధ పంటలలో ఎరువులు, పురుగు మందుల వాడకం గురించి రైతులకు వివరించారు. సేంద్రీయ సాగు విధానాలను, కూరగాయ పంటలలో సేంద్రీయ సాగు పద్ధతుల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది జ్యోతి, లిఖిత వాణి, పశుసంవర్ధక సహాయకులు లావణ్య , సేంద్రీయ సాగు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


టీబీపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

టీబీపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి -విజయపురం: మండలంలోని కళియంబాకంలో టీబీపై మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ లక్షణాలున్న వారి నుంచి గల్ల నమూనాలు స్వీకరించారు. బ్రీత్ సేఫ్ 360 -టీబీ అలెర్ట్ ఇండియా వారి సహకారంతో నగరి టీబీ యూనిట్ ఆధ్వర్యంలో ఈ క్యాంపు నిర్వహించారు. గ్రామంలో 50 మందికి స్క్రీనింగ్ చేసి, టీబీ లక్షణాలున్న 10 మంది వద్ద శాంపిల్ తీసుకున్నారు. టీబీ లక్షణాలు ఉంటే వెంటనే డాక్టరును సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సోమశేఖర్, విష్ణుప్రియ, సీహెచ్‌వో సుబ్బరామమ్మ, ఎస్ఐ బలరామయ్య, పీహెచ్‌ఎన్ భారతి, ఏఎస్ఐ గోవిందరాజులు, సర్పంచ్ విద్యాభాస్కర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి గాయత్రి, ఎంపీహెచ్‌ఎస్ మురళీ, శ్రీనివాస్, టీబీ సూపరువైజర్లు ఆల్బర్ట్, పవన్, దేవీ, ప్రియ, ఎంఎల్‌హెచ్‌పీలు సనీత, జీవ, హేమలత, గీత, ఏఎన్‌ఎంలు రేవతి, కుమారి, మునిభూషణ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతి

ప్రజాశక్తి -రొంపిచర్ల: రొంపిచర్ల మండలం పెద్ద గొట్టిగల్లు మాజీ ఎంపీటీసీ కాకర్ల వెంకటరమణ(70) మంగళవారం తెల్లవారుజామున గుండె పోటుతో ఆకస్మిక మృతి చెందారు. ఈయన బండ కింద పల్లి గ్రామం హరిజనవాడకు చెందిన వ్యక్తి. ఈయన ఎంతో సౌమ్యుడిగా, ఎంపీటీసీగా ప్రజలకు సేవలు అందించారు. వెంకటరమణ కుటుంబాన్ని ఎంపీపీ పురుషోత్తం రెడ్డి పరామర్శించి సానుభూతి తెలిపారు.

కల్లూరులో 'స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర'

ప్రజాశక్తి -రొంపిచర్ల: పులిచెర్ల మండలం కల్లూరు గ్రామపంచాయతీలో మంగళవారం స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ క్రీడా విభాగం అధ్యక్షుడు మహమ్మద్ అలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని , పరిసరాల పరిశుభ్రత తోనే ఆరోగ్యం గా ఉంటామని, ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక విఆర్ఆర్ కళాశాల విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

క్వారీని పరిశీలించిన అధికారులు


క్వారీని పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండలంలోని పద్మాపురం లెక్క దాఖలు సర్వే నెంబర్ 165/1 అక్రమంగా గత కొద్ది నెలలుగా జరుగుతున్న క్వారీని ఎట్టకేలకు మంగళవారం మైన్స్ అధికారులతో కలిసి ఎస్ఆర్ పురం తహశీల్దార్ లోకనాథ్ పిళ్ళై, కార్వేటినగరం సిఐ హనుమంతప్ప, ఎస్ఆర్ పురం ఎస్ఐ సుమన్ పరిశీలించారు. పిల్లిగుండ్లపల్లి గ్రామానికి చెందిన గుణశేఖర్ నాయుడు భార్య మోహనమ్మ కి పట్టా ఉండడంతో కొలిచి చూపించారు. మరి కొంత భాగం తమిళనాడుకు చెందిన మణి నాయుడుకి మూడు నెలల క్రితం రావడం దీంతో మణి నాయుడు కుమారుడు భానుప్రతాప్, గుణశేఖర్ నాయుడు భార్య మోహనమ్మలు క్వారీ తమదంటే తమదని తగవులు పడ్డారు. గత నెలరోజుల క్రితం ఇక్కడ గొడవ తారస్థాయికి చేరడంతో శాంతి భద్రతల దృష్ట ఎస్ఐ సుమన్ రెవెన్యూ, మైన్స్ అధికారులకు లేఖలు పంపారు. దీనిపై స్పందించిన అధికారులు మంగళవారం భూమిని కొలిచి మోహనమ్మకు రావలసిన భూమికి హద్దులు నిర్ణయించారు అలాగే మణినాయుడు క్వారీకి రావాల్సిన భూమికి హద్దులు కేటాయించారు. ఈ భూమిలో ఇద్దరు కాకుండా మూడో వ్యక్తి దాదాపు ప్రభుత్వం వచ్చినట్టు నుంచి కోట్ల విలువ చేసే రాతిని అక్రమంగా తరలించినారని ఇది వారిలో మోహనమ్మ, భాను ప్రతాప్‌లు మీడియా సమక్షంలో తమ ఆవేదన వ్యక్తపరిచారు. మంగళవారం జరిగిన సర్వేతో స్థానికులలో ఈ క్వారీ ఎవరిది ఇంత దాకా తరలించిన రాయికి లెక్కపక్క లేదా ఈ రాయి ఎవరి ఖాతాలో ఏమవుతుందనే విషయం చర్చ మారింది.

పోలీసు శునకం ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు పట్టణంలోని సాయుధ దళం కార్యాలయంలో 'జెన్నీ' అనే పోలీస్ శునకం ఉద్యోగ విరమణ పొందింది. దాదాపు పదకొండు ఏళ్ల పాటు పోలీసు డిపార్టుమెంటు కు సేవలందించిన జెన్నీ మంగళవారం ఉద్యోగ విరమణ పొందింది. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్‌పి మణికంఠ చందోలు ఉద్యోగ విరమణ పొందుతున్న జెన్నీకి శాలువా కప్పి, పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జెన్నీ అందించిన సేవలను కొనియాడారు. పలు కేసుల దర్యాప్తుల్లో జెన్నీ సహకారం మరువలేమని ప్రశంసించారు. పోలీసు శునకం 2013, నవంబరు 15వ తేదీ జన్మించిందని, ఇది గోల్డెన్ రిట్రైవర్ జాతి శునకం (స్నిఫ్ఫర్ డాగ్) అని, దీని హ్యాండ్లర్ పేరు బి శ్రీనివాసులు ఏఆర్‌హెచ్‌సి 3590 అని వివరిం చారు. జెన్నీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో హైదరాబాద్ లోని మొయినాబాద్‌లో ఎక్స్‌ప్లోజివ్ విభాగంలో 8 నెలల కఠిన శిక్షణ పొందిందన్నారు. జెన్నీ విఐపి, వివిఐపి కార్యక్రమాల్లో మెరుగ్గా సేవలు అందించిందన్నారు. ముఖ్యమైన దేవాలయాలు కాణిపాకం, తిరుమల బ్రహ్మోత్సవాలు, గోదావరి పుష్కరాల సమయాలలో సంఘ విద్రోహ చర్యల నివారణకు దీని సేవలు ఉపయోగించేవారని తెలిపారు. పలు కీలకమైన కేసుల్లో దీని సహకారం మరువలేని దన్నారు. ప్రపంచ నివాకా దళం రోజు వైజాగ్ లో నిర్వ హించిన ఎఎస్‌సి విధుల్లో జెన్నీ తన ప్రతిభను కనబరి చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు సబ్ డివిజన్ డిఎస్పీ టి సాయినాథ్ పాల్గొన్నారు.


పోలీసు శునకాన్ని సన్మానిస్తున్న ఎస్‌పి మణికంఠ చందోలు

ఉలవ కుప్పకు నిప్పు .. రూ.లక్ష అరవై వేల నష్టం

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం వల్లిగట్ల పంచాయతీ అగ్రహారం పల్లెకు చెందిన ఇద్దరు రైతులు ఉలవ పంట పండించి ఒబ్బిడి చేసేందుకు సమీపంలోని బండపై కుప్ప పోసి ఉండగా మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో పాటు ఉలవ పొట్టు మొత్తం అగ్నికి ఆహుతి అయిందని ఈ కారణంగా లక్ష అరవై వేల రూపాయల నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. కాశి రవీంద్ర, పి నరసింహులు ఇద్దరు రైతులు పక్కపక్కనే కుప్పలు పోసి ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్టుగా అనుమానిస్తున్నామని ఆరుగాలం కష్టించి పంట కోసి బండపై చేర్చి ఉలవలు ఇంటికి తెచ్చుకుందాము అనుకున్న సమయంలో ఇలా జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.


ఉలవ కుప్పకు నిప్పు పెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

3,241 మంది రైతుల పేర్లు నమోదు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: వ్యవసాయ ప్రత్యేక గుర్తింపు కార్డు కోసం ఇప్పటి వరకు 3,241 మంది రైతులు ఆన్‌లైనులో నమోదు చేసుకున్నారని మండల వ్యవసాయ అధికారిణి భవాని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మండలంలో 13,500 మంది రైతులు మొత్తం ఉన్నారని, ఆయా సచివాలయం పరిధిలో వ్యవసాయ సిబ్బంది ద్వారా 3,241 మంది రైతుల మంది రైతుల పేర్లు నమోదుకు మంగళవారం ఆన్‌లైను పూర్తయినట్లు చెప్పారు. భూములు కలిగిన రైతులు వ్యవసాయ కార్యాలయంలో ఆధార్ కార్డు, పట్టాదారు భూమి పాసుపుస్తకం, ఆధార్ లింక్ కలిగిన మొబైల్ ఫోన్ నెంబరును గ్రామాల్లోకి వచ్చే వ్యవసాయ సిబ్బంది వద్ద ప్రత్యేక వ్యవసాయ గుర్తింపు కార్డు కోసం ఆన్‌లైనులో పేర్లు పూర్తి చేసుకోవాలని కోరారు. నమోదు చేసుకోని రైతులకు రైతు భరోసా, పిఎంకిసాన్ , వ్యవసాయ సబ్సిడీ పరికరాలను పొందలేక పోతారన్నారు. ఈ అవకాశం ఈనెల 27 తేదీ లోపు సద్వినియోగం చేసుకోవాలని రైతులకు ఆమె పిలుపునిచ్చారు. గంగాధర నెల్లూరు మండలంలోని ప్రత్యేక గుర్తింపు కార్డు కార్యక్రమానికి మానిటరింగ్ ఆఫీసర్ విజయ్ శంకర్ రెడ్డి తూగుండ్రం, వరతూరు, మొక్కలతూరు, పంచాయతీలలో ఆన్‌లైను కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఏవో భవాని, సిబ్బంది కవిత పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారిణి భవాని

ఏపిపిటిడి (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం

ప్రజాశక్తి -పలమనేరు : పలమనేరు నియోజకవర్గం పలమనేరు సమీపంలో ని చరణ్ కన్వెన్షన్ హాల్‌లో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్‌సమావేశం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మాట్లాడుతూ, ఆర్టీసీలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై చర్చ, పలు, కీలక సూచనలు, సలహాలు తీసుకున్నామన్నారు. ప్రతి సభ్యుడికి వృత్తి విషయంలో అన్యాయం జరగకుండా యూనియన్ సభ్యులు సకాలంలో స్పందిస్తామన్నారు ఈ కార్యక్రమంలో అమరావతి ఆర్టీసీ జేఏసీ పలమనేరు డివిజనల్ అధ్యక్షుడు బాలకృష్ణ, పలమనేరు డిపో గౌరవ అధ్యక్షుడు సధీర్, చిత్తూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జగన్నాథం, బల రామమూర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి రాధాకృష్ణ, జోనల్ కార్యదర్శి రాజశేఖర్, చిత్తూరు జిల్లా జోనల్ కమిటీ సభ్యులు మధు, అన్వర్ ఖాన్, సీనియర్ నాయకులు మురళీధరన్, జిల్లా కమిటీ సభ్యులు, ఐదు డిపోల నాయకులు గ్యారేజ్ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో మహిళా కార్యకర్తలు, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.




కేన్సర్ స్క్రీనింగ్ పూర్తి చేయాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా వ్యాధి నిరోధక టీకాలు అధికారి డాక్టర్ హనుమంతరావు మాపాక్షి అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని శేషాచలపురం గ్రామాన్ని మంగళవారం సందర్శించి ఎన్‌సిడి సర్వే, ఆర్‌బిఎస్‌కే సర్వేని తనిఖీ చేశారు. ప్రతి ఇంటిలో 18 సంవత్సరాల పైబడిన ప్రతి ఒక్కరికి కేన్సర్ స్క్రీనింగ్ తప్పనిసరిగా పూర్తి చేయాలని తద్వారా త్వరిత గతిన లక్షణాలున్న వ్యక్తులను గుర్తించి చికిత్స అదించడం ద్వారా కేన్సర్ పూర్తిగా నయమవుతుందని తెలిపారు. ఆర్‌బిఎస్‌కె స్క్రీనింగ్‌లో (నాలుగు రకాల లోపాలు) లోపాలు ఉన్న పిల్లలను గుర్తించి చికిత్స చేసినట్లయితే ఆరోగ్యం వంతులుగా ఎదుగుతారని తెలిపారు. అన్ని రకాల స్క్రీనింగ్ కార్యక్రమాలను సూపర్వైజర్స్ మానిటర్ చేసి యాప్స్‌లో అప్డేట్ చేయాలని తెలిపారు. వ్యాధి నిరోధక టీకాలను చంటి బిడ్డలకు డ్యూడేట్ ప్రకారం తప్పక వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మార్చిలోగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రవి, ఢిల్లీ, అశోక్ పాల్గొన్నారు.

తహశీల్దారు కార్యాలయం తనిఖీ

ప్రజాశక్తి- రొంపిచర్ల: మండల తహశీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. గత సంవత్సరం డిసెంబరు, 2025వ సంవత్సరం జనవరి నెలలో జరిగిన రెవెన్యూ సదస్సులలో రైతులు వారి సమస్యలపై ఇచ్చిన అర్జీలను ఏ విధంగా పరిష్కరించాలని ఆయా గ్రామ విఆర్ఓలను గ్రామాల వారీగా సమావేశపరిచి సూచనలు సలహాలు తెలియజేశారు. తహసీల్దారు పి. కిరణ్ కుమార్ 186 సమస్యలపై అర్జీలు వస్తే, 83 పరిష్కరించినట్లు ఆర్డీవోకు తెలిపారు. మిగిలిన అర్జీదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీవో సూచించారు. ఆర్ఎస్ డిటి సి.లోకేష్, ఆర్ఐ బి.సుధాకర్ నాయక్, సీనియర్ అసిస్టెంట్ ఎస్.ముబారక్ బాషా, వీఆర్వోలు, సర్వేయర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌డివో శ్రీనివాసులు

వివాద స్థలం పరిశీలన

ప్రజా శక్తి - చిత్తూరు డెస్క్: సదుం మండల పరిధిలోని సదుం – పీలేరు రోడ్డు ఆనుకొని ఉన్న కుమారొడ్డు చెరువు ఆనుకొని వున్న ఎల్లమ్మ రజక సంఘంకు ప్రభుత్వం మంజూరు చేసిన సర్వే నెంబర్ : 76/1 లో0.53 సెంట్లు జాగాను కేటాయించింది. ఇందులో స్థానిక రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరువు ఆనుకొని రోడ్డు వేసుకోవాలని, దోబీ ఘాట్ స్థలంలో నిర్మించిన కమ్యూనిటీ హాలు అనుకొని మట్టి తోలడం తో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, దోబీ సంఘం నాయకులకు గత వారం నుంచి వివాదం నడుస్తోంది. వివాదంపై దోబీ సంఘం నాయకులు గత వారంలో కలెక్టర్ కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీదేవి, ఎస్ డి సి డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, రాష్ట్ర రజక సంఘం అధ్యక్షుడు షణ్ముగం మంగళవారం దోబి ఘాట్ వివాద స్థలాన్ని పరిశీలించారు. స్థానిక రియల్ ఎస్టేట్ వ్యాపారి బాబు రెడ్డితో మాట్లాడుతూ దోబీ ఘాట్ లో నిర్మించిన కమ్యూనిటీ హాల్ భవనం సగం జాగా రియల్ ఎస్టేట్ వ్యాపారుల సెటిల్మెంట్ ల్యాండ్ లో ఉందని రియల్ ఎస్టేట్ వ్యాపారి బాబురెడ్డి బీసీ కార్పొరేషన్ ఈడి శ్రీదేవికి ఫిర్యాదు చేశారు. రాష్ట్ర రజక సంఘం అధ్యక్షుడు షణ్ముగం స్పందించి రియల్ ఎస్టేట్ వ్యాపారి బాబు రెడ్డితో, ఎల్లమ్మ రజక సహకార సంఘం సభ్యులతో మాట్లాడి సమస్యని పరిష్కరించారు. దోబీ ఘాట్ స్థల వివాద పరిష్కారం లో భాగంగా రియల్ ఎస్టేట్ వ్యాపారి బాబురెడ్డి, దోబీ ఘాట్ సంఘం నాయకులు మధ్య అవగాహన కుదుర్చుకొని, జెసిబి తో అక్కడికక్కడే అధికారులు సమక్షంలోనే దోబి ఘాట్ స్థలం హద్దులు కోసం గాడి తవ్వడం గమనార్హం. ఈ కార్యక్రమంలో ఎల్లమ్మ రజక సహకార సంఘం జి గోపాల్, కార్యదర్శి వెంకటరమణ, నవీన్, రజక సహకార సంఘ సభ్యులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్


దాడిలో ధ్వంసమైన ద్విచక్రవాహనం, టీవీ, బీరువా

అన్నదమ్ముల భూతగాద

రాజమ్మ కుటుంబంపై దాడి

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి : అన్నదమ్ముల భూ తగాదాల్లో రాత్రికి రాత్రే దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ప్రత్యర్థులు రాజమ్మ కుటుంబంపై దాడి చేయడంతో బాధితులు ప్రస్తుతం ఆస్పత్రిలో వున్నారు. బాధితురాలి కథనం మేరకు.. మండలంలోని టీ గడ్డురు లోని వ్యవసాయ బోరు వద్ద కాపురం ఉన్న రాజమ్మ కుటుంబీకులపై తన మరిది కిట్టప్ప కూతుర్లు, వేరే గ్రామస్తులు కలిసి రాత్రి సమయంలో మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఇంట్లో ఉన్న బీరువా, టీవీ పగలగొట్టి బీరువాలో ఉన్న నగలు, భూమికి సంబంధించిన పాస్ బుక్కులు, రేషన్ కార్డులు, ఆధార్ కార్డు, బ్యాగ్ దొంగలించుకొని ఇంటి బయటకు వెళ్లి రాజమ్మ మనవడైన నారాయణస్వామి సంబంధించిన ఎఫ్‌జెడ్ ద్విచక్రవాహనాన్ని రాడ్లతో ధ్వంసం చేశారని తెలిపారు. అడ్డమొచ్చిన నారాయణస్వామి వీపుపై ట్రాక్టర్ రాడ్‌తో కొట్టినట్లు పేర్కొన్నారు. అతనికి వీపుపై రాడ్‌తో కొట్టడంతో చర్మం నల్లగా కమిలి గుర్తులు కన్పిస్తున్నాయన్నారు. ఈ విషయమై ఎస్ఐ పరుశురాముడును ప్రశ్నించగా బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

ఇద్దరు యువకులు మృతి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి మండలంలోని రాగి మాను పెంట క్రాస్ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు..కరిడి వారి పల్లికి చెందిన హేమ శేఖర్ కుమారుడు గౌతమ్ (21), తగ్గువారిపల్లి గ్రామానికి చెందిన బాబు కుమారుడు ఉమాపతి (15) మొగిలి వెంకటగిరి నుండి బంగారుపాలెంకు వస్తుండగా బంగారుపాళ్యం నుండి పలమనేరు వెళుతున్న కారు ఎదురెదురుగా ఢీకున్నాయి. ఈ సంఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నిత్య బాబు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన తనిఖీలో 15 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు పట్టుబడ్డారు. వీరిని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో మంగళవారం ఉదయం ప్రవేశపెట్టగా జడ్జి కుమారి ఉమా దేవి వాహనదారులు 15 మందికి ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున మొత్తం 1 లక్షా50 వేల రూపాయలు జరిమానా విధించారు.

తవణంపల్లి: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురు వ్యక్తులకు సెకండ్ క్లాస్ కోర్టు 10 వేల రూపాయలు జరిమానా విధించారు. బహిరంగ ప్రదేశంలో గుంపులుగా కూర్చొని మద్యం సేవించిన 13 వ్యక్తులకు సైతం సెకండ్ క్లాస్ కోర్టు జరిమానా విధించిందని ఎస్పై చిరంజీవి పేర్కొన్నారు.

అర్జీలు త్వరగా పరిష్కరించాలి: ఆర్‌డివో

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: సదుం మండల పరిధిలో గత డిసెంబర్ లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో రైతులు రీ– సర్వేకు వచ్చిన భూ సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరిం చాలని పలమనేరు ఆర్డిఓ పి భవాని అన్నారు. ఆర్డిఒ సదుం తహశీల్దారు కార్యాలయంలో స్థానిక తహశీల్దారు మారూఫ్ హుస్సేన్, ఆర్. ఐ అశ్విన్ వీఆర్వోలు, సర్వేయర్లతో మంగళవారం సమీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డిఓ భవాని స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత డిసెంబరు లో సదుంలో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సుల్లో 81 మంది రైతుల నుండి అర్జీలు వచ్చాయ న్నారు. వీటిలో 68 అర్జీల భూ సమస్యలను పరిష్కరిం చామన్నారు. అనంతరం ఆమె పాలమంద ఏరియాలోని భూములపై రీ సర్వేను నిర్వహించారు. ఆమె వెంట తహశీల్దారు మారూఫ్ హుస్సేన్, డిటి కుమార్, ఆర్ఐ అశ్విన్, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

రేపు రుణాల లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి -సోమల: బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు గురువారం 20వ తేదీ ఉదయం 10.30 గంటలకు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశపు మందిరంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని లబ్ధిదారులు తమ వెంట ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, బ్యాంకు పాస్‌బుక్, కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, మూడు ఫొటోలు తీసుకురావాలని ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు జిరాక్స్ కాపీలు కూడా తీసుకు రావాలని ఎంపీడీవో నారాయణ తెలిపారు.

బంగారమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి కార్వేటినగరం: నగరం ప్రజలు బంగారమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. అమ్మవారి మూలవిరాట్‌కు పాలు, పెరుగు, తేనే, పసుపు, చందనం, నారికేళి జలాలు వంటి సుగంధ జలాలతో అభిషేకాలు చేపట్టారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పురుషోత్తం మొదలియార్ కుటుంబ సభ్యులు చిన్నారిని ఆలయంలో తులాభారం నిర్వహించి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. సాయిబాలాజీ నగర్‌లోని షిరిడీ నాయినాధుని ఆలయంలోనూ చిన్నారికి తులాభారం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ అధ్యక్షుడు ప్రసాద్ తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉపాధ్యక్షుడు రంగనాధం మొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్ పిళ్లై, భక్తులు పలువురు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION) :: PUTTUR
E.P.No.35 /2020
O.S.No.86 /2012

Between:
A. Rathna Reddy ...**Decree Holder**
And
A. Gnanamma (died) and others ...**Judgement Debtors**

NOTICE TO JUDGMENT DEBTOR No.4.

To
J.Dr.No.4
B. Ramadevi, W/o Vijayasekhara Reddy, Nallapalli village, Rama Naidu Colony, Settivanatham post, S.R. Puram Mandal, Chittoor District.

Madam
Please take notice that the decree holder filed the above E.P. against you and others under Rule 32(1) notice in respect of the E.P. schedule property and the same was posted to 25-02-2025 for your appearance. If you have got any objections you may appear on 25-02-2025 at 10.30 A.M. either in person or through your counsel and file your objections. In the event of your failure, the matter will be decided exparte.

Hearing date: 25-02-2025
SRI K. PURUSHOTHAM, M.A., B.L.,
Advocate for decree holder,
PUTTUR.